సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 22 । మే । 2024



జీడి రైతు దిగాలు

ఉద్దానం జీడి రైతులు దిగులు చెందుతున్నారు. దిగుబడులు లేవని అంటున్నారు.
- 8లో



24 నుంచి సప్లిమెంటరీ

ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మొదలుకానుంది. జూన్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి.
- 8లో



ఇచ్ఛాపురం రూరల్: శ్రీదుర్గ వేషధారణలో తాడేపల్లి గూడెం కళాకారుడు

న్యూస్‌రీల్

'ప్రతి బోటుకు జీపీఎస్ తప్పనిసరి'



లైఫ్ జాకెట్ల వాడకంపై అవగాహన కల్పిస్తూ..

గార: ప్రతి బోటుకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని మత్స్యశాఖ ఏడీ ఎ.సంతోష్‌కుమార్ అన్నారు. బందరువానిపేట గ్రామంలో మత్స్యశాఖ, కోస్టుగార్డు, మెరైన్ సంయుక్తంగా వేటకు వెళ్లే మత్స్యకారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోటులో తప్పనిసరిగా మొబైల్ ఫోన్ తీసుకువెళ్తున్నారని, జీపీఎస్ మొబైల్‌లోనే ఉంచుకోవాలన్నారు. వేటకు వెళ్లే ప్రతి బోటు రిజిస్ట్రేషన్ కచ్చితంగా ఉండటంతో పాటు ఎరుపు రంగు వస్త్రాన్ని తీసుకువెళ్లాలన్నారు. సముద్రంలో జీపీఎస్ నిలిచిపోయినా, వాతావరణంలో మార్పులు జరిగినా, ఎలాంటి ఇబ్బంది ఏర్పడినా ఎరుపు వస్త్రాన్ని బోటుపై నుంచి ఎగురవేయాలన్నారు. ఈ జెండాను కోస్టుగార్డు సిబ్బంది గమనించి అవసరమైన చర్యలు తీసుకోడానికి అవకాశం ఉంటుందని వివరించారు. బోటు యజమానులు ప్రభుత్వం సూచించిన రంగులను బోటుకు వేయాలని సూచించారు. బోటులో లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ఉంచేలా చూడాలని, మత్స్యకారులకు రక్షణకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు ఉంటాయని, ఆ సమయంలో వేటకు వెళ్లే మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ నారీమణి, ఎస్ఐ మహాలక్ష్మీ, కోస్టుగార్డు సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ హేమసుందర్, సాగర మిత్రలు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు



విద్యార్థుల హాల్ టిక్కెట్లు శివానీలో పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్ మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఈ నెల 16వ తేదీ నుంచి కొనసాగుతున్న పరీక్షలు ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్నాయి. బైపీసీ స్ట్రీమ్ పరీక్షలు 16, 17 తేదీల్లో జరగ్గా, ఈ నెల 18వ తేదీ నుంచి ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారం నాటికి 10,286 మందికి 9,700 మంది హాజరు కాగా, 586 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం నాలుగు పరీక్ష కేంద్రాల్లో 2076 మందికి 1974 మంది హాజరు కాగా, 102 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్టులో 329కి 312, రెండో షిఫ్టులో 330కి 311 మంది హాజరయ్యారు. టెక్కలి ఐతం కళాశాలలో మొదటి షిఫ్టులో 300 కి 288, రెండో షిఫ్టులో 300 కి 290 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో 230కి 215, రెండో షిఫ్టులో 229కి 218 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్టులో 179కి 167, రెండో షిఫ్టులో 179కి 173 మంది హాజరయ్యారు.

ఉత్సవ ఉత్సాహం



టెక్కలి: శాసనాం గ్రామంలో గ్రామదేవతల సంబరాల్లో ఘటాలతో ఊరేగింపు



కవిటి: చింతామణి అమ్మవారి ఊరేగింపు

జిల్లాలోని పల్లెల్లో ఉత్సవ ఉత్సాహం కనిపిస్తోంది. పల్లెల్లో గ్రామదేవత సంబరాలు నిర్వహిస్తుండడంతో ఆ హుషారు కనిపిస్తోంది. ఘటాల ఊరేగింపులు, వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊళ్లన్నీ హోరెత్తుతున్నాయి.

మన విత్తనం.. మనదే పెత్తనం



- గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి ప్రోత్సాహం
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ శ్రీధర్
- కవిటి ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఖరీఫ్ వరిసాగుపై అవగాహన

కవిటి:

రైతు స్థాయిలో విత్తనోత్పత్తి చేయగలిగితే మెరుగైన ఆదాయం లభించడంతో పాటు భవిష్యత్ తరాలకు సాగు సులభం అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో బీవీకే రైతు ఉత్పత్తిదారుల సంఘం సౌజన్యంతో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 2024–25 ఖరీఫ్ వరిసాగు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఈ ఏడాది కవిటి మండలంలో ఎంపిక చేసిన రైతులకు 50 ఎకరాల్లో ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వరి రకం విత్తనోత్పత్తి పథకం కోసం ఈ సమావేశంలో చర్చించారు.

సూచనలివే..

ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ విత్తనోత్పత్తి పథకం విధివిధానాలు రైతులకు వివరించారు.

- ఈ కార్యక్రమంలో భాగంగా 50శాతం రాయితీపై ఫౌండేషన్ సీడ్‌ను ఈ పథకంలో ఎంపికైన రైతులకు ముందస్తుగా అందిస్తామన్నారు.
- మూడు దశల్లో పంట చేతికి అందే వరకు ఏపీ సీడ్స్ సంస్థ సాంకేతిక సిబ్బంది రైతులకు నాణ్యమైన విత్తనోత్పత్తికి సూచనలు సలహాలు అందిస్తారని, పంట నాణ్యతను పరిశీలిస్తారని తెలిపారు.
- ఈ మూడుసార్లు ఏపీసీడ్స్ ప్రతినిధులు పంటపొలానికి రావడానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.
- ఏపీ సీడ్స్ నాణ్యతా ప్రమాణాలతో కూడిన మేలైన నాణ్యమైన విత్తనాలు అందించగలిగితే రైతులకు సంస్థ వారే స్వయంగా అధిక ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు బైబ్యాక్ అగ్రిమెంట్ కూడా చేస్తారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ కె.శ్రీధర్

తయారీ ఇలా..



నాణ్యమైన విత్తన తయారీలో ప్రాథమికంగా పాటించాల్సిన పద్ధతులపై సీనియర్ వ్యవసాయ సహాయసంచాలకులు పి.భవానీ శంకర్, కె.జగన్మోహన్‌రావు, సీనియర్ వ్యవసాయాధికారి బొర్ర నరసింహమూర్తి కీలకమైన సూచనలు చేశారు.

- విత్తనం నిల్వలో ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. వరి కోత కోసినప్పుడు నూర్పిడి సమయాల్లో యాంత్రిక కల్తీ నివారించాలి.
- విత్తనాన్ని ఎండబెట్టేటప్పుడు తేమ శాతం 13 శాతానికి మించకుండా ఉండాలి. కళ్లాల్లో యాంత్రిక కల్తీ లేకుండా చూడాలి.
- విత్తన నిల్వకు బాగా శుభ్రం చేసిన గోనె సంచుల్ని వాడాలి. వీలైనంత వరకు కొత్త సంచులను మాత్రమే ఉపయోగించాలి.
- గోనె సంచుల్లో నిల్వ చేసిన విత్తనాలను అధిక తేమ శాతం అధిక ఉష్ణోగ్రతకు గురి కాని గాలి వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి.
- విత్తనోత్పత్తి గ్రామస్థాయిలో గానీ, ఒక రైతు సహకార సంస్థ స్థాయిలో చేసేటప్పుడు ఒక ప్రాంత రైతులందరూ తమకు కావాల్సిన విత్తనాన్ని ముఖ్యంగా ఒకే రకానికి చెందిన ఉత్పత్తి చేయడం మంచిది.
- దీంతోపాటు నాణ్యమైన విత్తనం కోసం కొన్ని మెలకువలు పాటించాల్సి ఉంటుంది. విత్తన ఉత్పత్తి సారవంతమైన మంచినీటి వసతి ఉన్న పొలాల్లోనే చేపట్టాలి. లేకుంటే విత్తన నాణ్యత దెబ్బతింటుంది.
- విత్తనోత్పత్తి అంతకు ముందు పంట కాలంలో అదే రకం వేసిన పొలంలో లేదా వేరే పంట వేసిన పొలంలో సాగు చేయటం వల్ల స్వయం ఉత్పత్తి మొలకల వల్ల కల్తీ జరగకుండా జాగ్రత్త పడవచ్చు.
- రబీ కాలానికి విత్తన ఉత్పత్తి చేసే పొలాల్లో ఖరీఫ్ నుంచి నేలలో కలిసిన వరి గింజలు మొలకెత్తకుండా చేయటానికి దమ్ములో 10 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ వేసి ఎనిమిది నుంచి పది రోజులు మురగబెట్టాలి.
- విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టూ అదే పంటకు చెందిన వేరే రకం ఉంటే అంతర దూరం పాటించాలి.
- విత్తనోత్పత్తి విషయంలో ధ్రువీకరించిన వరి విత్తన నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి.
- జన్యు స్వచ్ఛత 98శాతం, భౌతిక స్వచ్ఛత 98 శాతానికి తగ్గకుండా ఉండాలి.
- జడ పదార్థం రెండు శాతం, మొలక శాతం కనీసం 80 శాతం ఉండాలి. తేమశాతం 13% ఉండాలి.
- పైపొట్టు లేని గింజలు రెండు శాతం మించకూడదు. ఇతర పంటలు లేదా రకాల విత్తనాలు కిలోకి 20 గింజలు మాత్రమే పరిమితం కావాలి. ఈ ప్రమాణాలు విధిగా పాటించాలి.
- విత్తన ఉత్పత్తిలో ప్రధానమైన అంశం పంటలో కేళీలను నివారించటం.
- ఈ కేళీల ఏరివేత ముఖ్యంగా మూడు దశల్లో చేపట్టాలి.
- ఒకటి పైరు దుబ్బు చేసే సమయం, రెండు పూత దశ, మూడు గింజ గట్టి పడినప్పుడు అంటే వరికోతకు ముందు...
- ఈ మూడు దశల్లో వ్యవసాయ శాఖ నిపుణులు సూచించిన మేరకు కేళీలను ఏరివేసే ప్రక్రియ విధిగా చేపట్టడం ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తికి మార్గం సుగమం అవుతుంది.
- కార్యక్రమంలో రైతులు బల్లెడ కృష్ణారావు, బెందాళం శ్రీరాంప్రసాద్, దుద్ది సతీష్, బల్లెడ జయప్రకాష్, పూడి ప్రసాద్, భావన చందనం తదితర రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ ఈ సెట్‌లో కొత్తూరు విద్యార్థి ప్రతిభ



అలివిల్లి కేతేశ్వరరావు

కొత్తూరు: కొత్తూరు మండలం జోగిపాడుకు చెందిన అలివిల్లి కేతేశ్వరరావు తెలంగాణ ఈ సెట్ ఫలితాల్లో ప్రతిభను కనబరిచాడు. ఈ నెల 20 తేదీన తెలంగాణ ప్రభుత్వం ఈసెట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కేతేశ్వరరావు మెటలాజీలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించాడు. కేతేశ్వరరావు విశాఖపట్నం జిల్లా కంచరపాలెంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో డిప్లమా పూర్తి చేశాడు. కేతేశ్వరరావు తల్లిదండ్రులు మిన్నారావు హైమావతి. తండ్రి విశాఖపట్నంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఫస్టు ర్యాంకు సాధించడంపై విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

- జూన్ 4 కోసం అందరి ఎదురుచూపులు
- కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు



దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం, జూన్ 4 ఫలితాల కోసం వేయి కళ్లతో బడుగు బలహీన వర్గాలన్నీ ఎదురు చూస్తున్నాయని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు) పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుపేదలు, వృద్ధులు, మహిళలు ఓటు అనే ఆయుధంతో వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు అనుకూల మీడి యాతో ఎన్ని కుయుక్తులు చేసినా అంతిమంగా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 9న విశాఖలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, అందులో సందేహమే లేదన్నారు. అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెంచే నాయకుడు, పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య అనే ఆస్తిని అందించి సుదీర్ఘకాలంలో వాటి ఫలితాలు అందుకునేలా ప్రణాళిక సిద్ధం చేసిన నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు.

జిల్లాలో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, బుడగట్లపాలెం ఫిషింగ్‌హార్బర్, హిరమండలం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక పనులు చేసినందుకు సిక్కోలు ప్రజలు జిల్లాలో 8కి 8 గెలిపించి సీఎంకు బహుమతిగా ఇస్తారన్నారు.

ఆశాజనకంగా పనస పంట

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్యాన పంటల్లో ఒకటైన పనస పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. ఉద్దాన ప్రజల జీవనాధారమైన జీడి పంట ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో పనస పంట దిగుబడి కలిసి రావడంతో రైతులకు కొంత ఊరట లభించింది. గత ఏడాది కంటే పనస పంట ఈ ఏడాది దిగుబడి బాగానే ఉందని రైతులు తెలిపారు.



అమ్మకానికి తరలిస్తున్న పనస కాయలు

సుభలయలో కార్డన్‌సెర్చ్

హిరమండలం: సుభలయలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది సుభలయలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా అల్లర్లకు, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగులు కొనసాగితే సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడైనా జూదాలు, పందాలు కొనసాగితే పోలీసు స్టేషన్‌కు కానీ, సచివాలయంలో కానీ తెలియజేయాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



హిరమండలం పోలీసులకు సూచనలిస్తున్న ఎస్ఐ నారాయణస్వామి

వైభవంగా అశ్వవాహన సేవ



స్వామి వారి అశ్వవాహన సేవ

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయం ఏర్పడి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వవాహన సేవ జరిగింది. ఆలయం వద్ద నుంచి స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దపేటతో పాటు బొంతల వీధి, కలివరపు పేటలో ఊరేగింపు నిర్వహించారు. వందల మంది భక్తులు స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్నారు.

అశ్వవాహన సేవను వైఎస్సార్ సీపీ నాయకులు పాగోటి రాజారావు, ఆలయ ట్రస్టీ ప్రతినిధి పి.కృష్ణప్రసాద్‌లు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అర్చకులు కృష్ణమాచార్యులు, బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు మావుడూరి జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలి
- జాయింట్ కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్ కోసం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒక్కో హాల్‌లో అబ్జర్వర్లకు ఒక సహాయకుడు ఉండాలని సూచించారు. లేబర్ అరెంజ్‌మెంట్‌కు సంబంధించి డ్వామా పీడీ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శిక్షణ తరగతులకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ మే 25న జరగనుండగా, దీని కోసం చేపట్టాల్సిన పనులపై కూడా సమీక్షించారు. తరగతుల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సూచనలు అనుసరించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై పూర్తి శిక్షణ అందజేయాలని, 23వ తేదీన ఆర్‌ఓలకు ఏఆర్‌ఓలకు కూడా శిక్షణ తరగతులు జరగనున్నాయని తెలిపారు. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మూడు అంచెల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. మీడియా సెంటర్ ఏర్పాట్లపై జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారితో సమీక్షించి చేపట్టాల్సిన పనులపై సూచనలు అందజేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం తదితర ఏర్పాట్లపై డిప్యూటీ సీఈఓతో సమీక్షించారు. కౌంటింగ్ హాల్ ఏర్పాట్లపై ఆరా తీశారు. సీసీ టీవీ ఏర్పాట్లు, వీడియోగ్రాఫర్స్ ఏర్పాట్లపై సూచనలు అందజేశారు. అనంతరం సెక్యూరిటీ ఏర్పాట్లకు సంబంధించి మొబైల్ కలెక్షన్ కౌంటర్, మెటల్ డిటెక్టర్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుపై పోలీసులకు సూచనలు అందజేశారు. కౌంటింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై సుడా వీసీకి, కౌంటింగ్ కేంద్రంలో కావాల్సిన స్టేషనరీ ఏర్పాట్లపై జిల్లా పరిషత్ సీఈఓకి తగు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వర రావు, సుడా వీసీ ఓబులేసు, సర్వశిక్షా అభియాన్ పీఓ జయప్రకాశ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌బీసీ సిరాజ్, కిరణ్, డీసీఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు ప్రారంభించారు. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల పరిశీలకుల సూచనల మేరకు ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి 18 స్ట్రాంగ్ రూముల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్ర పర్చారు. కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు పరిశీలించి, అనంతరం ఈవీఎంల లెక్కింపు నిర్వహించనున్నారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాలు నిఘా, వీడియో చిత్రీకరణలో కొనసాగనుంది. కళాశాల ఆవరణలో సైతం టెంట్లు వేస్తున్నారు. మరో పక్క అధికారులు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టారు. జిల్లా మొత్తం ఓట్ల లెక్కింపు ఇక్కడే కావటంతో భారీగా రాజకీయ పార్టీల శ్రేణులు చేరుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అధిక సంఖ్యలో వాహనాలను అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, అధిక జనాలు గుమిగూడకుండా చర్యలు తీసుకునేలా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక పర్యవేక్షిస్తున్నారు.



శివానీ కళాశాల ఆవరణలో కౌంటింగ్ భద్రత, ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్పీ రాధిక

క్లుప్తంగా

సేవాదళ్ సమన్వయకర్తగా నాగేశ్వరరావు



శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల జిల్లా సేవాదళ్ సమన్వయకర్తగా పప్పల నాగేశ్వరరావును నియమించినట్లు జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు అనుమతితో ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు గత 20 ఏళ్లుగా సత్యసాయి సేవా సంస్థలో విశేషమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈయన ఎంపికపై రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు అధ్యక్షులు గంగుల రమణబాబు, కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, ఆధ్యాత్మిక సమన్వయ కర్త అనాదిగుప్త, బోయిన నర్సింహమూర్తి, టిఎస్ఎన్ మూర్తి, అమ్మాయమ్మ, పుణ్యావతి, అనురాధ, కంబ మురళీ, రమణమూర్తి, శశికాంత్, శివకుమార్‌లు అభినందనలు తెలిపారు.

'పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత'



మాట్లాడుతున్న వెంకటశివ

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యలో పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని వీఆర్ కన్సల్టెన్సీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బి.వెంకటశివ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఫలితాలతో కూడిన ఆధార సహిత విద్య అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బోధకులు విద్యార్థుల్లో నైపుణ్యాలకు కృషిచేయాలని, వారిలో ఆసక్తి, ప్రతిభను ప్రోత్సహించాలని చెప్పారు. నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపు ఉన్న సంస్థలు సాంకేతిక విద్య పూర్తి చేసి రిలీవ్ అయిన విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇచ్చేలా విద్యాబోధన సాగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణమూర్తినాయుడు, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ పాల్గొన్నారు.


వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ, శ్రీకాకుళం ఆధ్వర్యంలో చలన సంబంధ, బధిర, అంధ విభిన్న ప్రతిభావంతులైన బాలికల కోసం నిర్వహిస్తున్న హాస్టల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహంలో 1–10 వరకు, ఇంటర్ ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థినులకు వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతితోపాటు, నోట్ బుక్స్, యూనిఫారాలు, కాస్మోటిక్ చార్జీలు తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు కోరే వారు ఆధార్ కార్డు, వికలాంగ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం, ఏదైనా పాఠశాలలో చదివితే బదిలీ ధ్రువీకరణ పత్రములతో కార్యాలయానికి పోస్టు ద్వారా గానీ మెయిల్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విభిన్నప్రతిభావంతుల బాలికల వసతి గృహం, ప్రభుత్వ మహిళా కళాశాల, శ్రీకాకుళం చిరునామాకు దరఖాస్తు పంపాలని, వివరాలకు 8074777210, 9951971764 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార సేవలు'

కాశీబుగ్గ: దేశంలోని వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని, దేశంలో కో–ఆపరేటివ్ బ్యాంకులకు ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆదర్శప్రాయమని డీవీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. కాశీబుగ్గ ఎస్ఎంసీ కల్యాణ మండపంలో మంగళవారం బ్యాంక్ ఇన్‌చార్జి డైరెక్టర్ కె.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన పలాస బ్రాంచ్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవింగ్ ఖాతాల్లోని నిల్వలపై రోజువారీ లెక్కింపు ప్రాతిపదికన 5 శాతం వడ్డీ చెల్లిస్తున్న బ్యాంకు కేవలం విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మాత్రమేనని అన్నారు. డీవీసీబీకు 2022–23 ఏడాదికి 97,122 మంది సభ్యులు ఉండగా 2023–24 ఏడాదికి లక్షా 4వేల 865 మంది సభ్యులున్నారని, ఇది వ్యాపార సంస్థ కాదని ప్రజల సంస్థ అని అన్నారు. ఈ ఏడాది రూ.83 కోట్ల లాభం వచ్చిందని డిపాజిట్‌లపై 10శాతం లాభాలను సభ్యుల ఖాతాలకు జమ చేశామన్నారు. దేశంలో గల 1514 కో ఆపరేటివ్ బ్యాంకుల్లో మొదటి పది స్థానాల్లో డీవీసీబీ బ్యాంక్ నాలుగో స్థానంలో నిలిచిందని అన్నారు. తనఖా రుణాల వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీలో 4 శాతం నగదు ప్రోత్సాహకంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, పలాస బ్రాంచి మేనేజర్ పి.సిరి, రాజాం బ్రాంచ్ మేనేజర్ జీఎల్‌వీ ప్రకాశరావులతో పాటు బ్యాంక్ సిబ్బంది క్రాంతి నాయక్, దుర్గారావు, భరత్, శ్రీనివాసరావు, రంజిత్, శివక్రిష్ణ, సమన్వయ కమిటీ సభ్యులు, షేర్ హోల్డర్స్ పాల్గొన్నారు.

జీడి రైతు దిగాలు



జీడి పిక్కలు

- ఇళ్లకు చేరుకున్న జీడి పంట
- విక్రయానికి ఎదురుచూపులు
- జిల్లాలో 24వేల హెక్టార్లలో జీడి సాగు
- తగ్గుతున్న దిగుబడి

పలాస: జీడి రైతుకు దిగులు పట్టుకుంది. జిల్లాలో మొత్తం 30 మండలాల్లో జీడి పంట విస్తారంగా సాగవుతోంది. అయితే పలాస రెవెన్యూ డివిజన్‌లోని ఉద్దానం ప్రాంతంలో గల 7 మండలాల్లో అత్యధికంగా జీడి పంట సాగవడమే కాకుండా ఆ ప్రాంత ప్రజలకు ఈ పంట ప్రధాన జీవనాధారంగా ఉంది. జిల్లా మొత్తం మీద 24వేల హెక్టార్లలో పంటను సాగు చేస్తున్నారు. ఉద్దానం జీడి పప్పు వల్ల పలాస జీడి పప్పునకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. పలాస జీడి పప్పు దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతోంది. ఈ ప్రాంతంలోని జీడి పరిశ్రమలను కలుపుకొని జిల్లా మొత్తం మీద 412 జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలు ఏడాది సగటున 200 రోజులు పనిచేస్తాయి. దీని వల్ల వేలాది మంది కార్మిక కుటుంబాలు కూడా బాగుపడుతున్నాయి. అయితే ఈ పరిశ్రమలకు జీవనాడిగా ఉన్న ఇక్కడ జీడి రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్టుగా జీడి పంటకు ధర మాత్రం రావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

ఏడాదికి ఈ పంట ఒకే సారి కాపునకు వస్తుంది. ఏడాది పొడుగునా ఈ పంట కోసం రైతులు ఎదురు చూస్తుంటారు. మార్చి నుంచి పంటపై ఆశలు పెంచుకున్న రైతులు మే నెల చివరి వరకు జీడి తోటల్లో జీడి పిక్కలను రక్షించుకోవడానికి నానా తంటాలు పడి పురుగులు మందులు పిచికారీ చేసి, అనంతరం పంట చేతికి అందుతుందనగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబం మొత్తం చెట్టుచెట్టు తిరిగి, కొమ్మల్లో, రెమ్మల్లో ఉన్న జీడి పిక్కలను ఏరి పళ్ల నుంచి పిక్కలను వేరు చేసి వాటిని ఎండలో ఆరబెట్టి, ఆ తర్వాత వాటిని గోనె సంచుల్లో నింపి భద్ర పరుస్తారు. ప్రస్తుతం ఆ విధంగా ఇంటికి తీసుకొచ్చిన పిక్కలను అవసరాలకు అమ్ముకుందామంటే వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది బస్తా పిక్కలు రూ.8వేలుకు రైతులు విక్రయించగా నేడు రూ.9వేలు ధర పలుకుతోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సంఘాల నాయకులు మాత్రం బస్తా పిక్కల ధర కనీసం రూ.16వేలు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు.

ఎకరాకి 3 బస్తాలు కూడా కాలేదు



ఈ ఏడాది పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. కనీసం ఎకరాకి 6 బస్తాలు పిక్కలు రావాలి. ఈ ఏడాది 3బస్తాలు కాలేదు. అందుకు తోడు జీడి పంటకు కనీస ధర కూడా లేదు. అసలు మార్కెట్‌లో ఎంత ధర ఉందో వ్యాపారులు చెప్పడం లేదు. కొనడానికి ఇంకా గ్రామాల్లోకి రావడం లేదు. ఈ ఏడాది రైతుల పరిస్థితి ఏమి బాగులేదు.

– వంకల కూర్మారావు, మామిడిపల్లి, పలాస మండలం

గిట్టుబాటు కావడం లేదు



ప్రస్తుతం జీడి పంట గిట్టుబాటు కావడం లేదు. పెట్టుబడులు చాలా ఎక్కువ అవుతున్నాయి. ఎకరా జీడి తోటకు కనీసం రూ.10వేలు పెట్టుబడి అవుతోంది. తోటలు మలుపు నుంచి దుక్కి, ఎరువులు, క్రిమిసంహారక చర్యలు తప్పడం లేదు. దీనికి తోడు శ్రమ కూడా చాలా ఎక్కువ. కుటుంబం మొత్తం కష్టపడి పిక్కలను సేకరించాల్సి ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే కూలి కూడా కిట్టదేమో అనిపిస్తుంది.

– వంకల అప్పారావు, బొడ్డపాడుకాలనీ, పలాస మండలం

వరుస చోరీలతో భయాందోళన



వెంకటేశ్వర రైస్ మిల్లులో జరిగిన దొంగతనంపై పరిశీలిస్తున్న ఏఎస్పీ ప్రేమ్ కాజల్ (ఫైల్)

సారవకోట: మండలంలో ఎప్పుడూ లేని విధంగా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి 1న మండలంలోని చీడిపూడి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో నైట్ వాచ్ మెన్‌ను బెదిరించి మిల్లు కార్యాలయపు తాళాలు పగులగొట్టి మిల్లులో దాచిన రూ.1.30 లక్షలు దొంగిలించుకుపోయారు. ఆ మిల్లుకు సమీపంలో ఉన్న బుడితిలో అయ్యప్ప స్వామి ఆలయం, షిర్డీ సాయి ఆలయాల్లో సైతం దొంగలు చోరీలకు పాల్పడ్డారు. అలాగే మే నెల 1న బుడితి గ్రామంలో బోర శిమయ్య కుటుంబ సభ్యులు తాళాలు వేసుకుని బెంగళూరు వెళ్లగా దొంగలు ఇంట్లో చొరబడి ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారం, నగదు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. మూడు రోజుల కిందట ధర్మలక్ష్మీపురం గ్రామానికి సమీపంలో అనకాపల్లి జిల్లా మామిడి పల్లి గ్రామానికి చెందిన మణికంఠ అనే వ్యక్తి నుంచి తాము పోలీసులమని చెప్పి దుండగులు రూ.10 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇలా వరుసపెట్టి సంఘటనలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రంలో పలువురు యువత గంజాయిని ఒడిశా నుంచి తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌కు సమీపంలో ఉన్న పాఠశాల ఆవరణలో సేవిస్తున్నారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని, దొంగతనం కేసుల విషయంలోనూ పురోగతి సాధించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడా మైదానంలో ఆస్తి ధ్వంసం



క్రీడామైదానంలో విరిగిన కుర్చీలు, బెంచీలు

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో ప్రజల సహకారంతో కొత్తగా ఏర్పాటు చేసిన క్రీడామైదానంలో గల కుర్చీలు, బెంచీలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ దుశ్చర్యను క్రీడామైదానం కమిటీ తీవ్రంగా పరిగణించింది. మూడెకరాల విస్తీర్ణంలో గత ఈ క్రీడా మైదానాన్ని ఆటలకు అనువుగా తీర్చి దిద్ది క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన కాంక్రీటు బెంచీలు, కుర్చీలను విరగ్గొట్టారు. సుమారు రూ.20లక్షల పెట్టుబడితో ఈ మైదానాన్ని అందంగా తీర్చి దిద్దారు. ఈ సంఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కాశీబుగ్గ పోలీసులను కోరారు.

వాహనదారులకే పెట్రోల్, డీజిల్ విక్రయించాలి

కంచిలి: పెట్రోలు బంకుల వద్ద వాహదారులకు మాత్రమే పెట్రోల్, డీజిల్ విక్రయించాలని స్థానిక ఎస్ఐ వి.రాజేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రో ఉత్పత్తులను బంకుల వద్ద లూజ్ సేల్స్ చేపట్టవద్దన్నారు. బాణాసంచా, టపాసులు అక్రమంగా తరలించడం, నిల్వ ఉంచడం నేరమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం నిల్వ ఉంచరాదని,అక్రమ రవాణా చేయరాదని, డీజే డ్యాన్స్‌లు నిర్వహించడం నిషేధమని అన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగడం వంటివి చేయరాదని పేర్కొన్నారు.

తాగుబోతుల వీరంగంపై విచారణ

రణస్థలం: రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం తాగుబోతుల వీరంగంపై విచారణ చేపట్టామని డీసీహెచ్ఎస్ జీవీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె మండలంలోని రణస్థలం సీహెచ్‌సీని సందర్శించి తాగుబోతుల వీరంగానికి గల కారణాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బందిపై కెల్ల జగన్, కెల్ల నవీన్ కుమార్‌లు దాడి చేయడంతో పాటు దుర్భాషలాడటం వంటి పలు అంశాలపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌కు కూడా నివేదిక అందిస్తామన్నారు.



సిబ్బందిని విచారిస్తున్న డీసీహెచ్ఎస్ రాజ్యలక్ష్మి

విచారణలో రణస్థలం సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి.లలిత, సిబ్బంది ఉన్నారు.

పాముకాటుతో బాలుడు మృతి

- క్రికెట్ ఆడుతుండగా ఘటన

టెక్కలి రూరల్: టెక్కలి మండలం చిన్ననారాయణపురం(గొల్లదాసు పేట)లో మంగళవారం ఓ బాలుడు పాముకాటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన దాసరి మురళి, నిరుషల పెద్దకుమారుడు సాయివినీత్(12) తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లాడు. బాల్ రాళ్ల కుప్పలో పడడంతో దాన్ని తీసేందుకు ఆ కుప్పలోకి చేయి పెట్టాడు. అక్కడ ఏదో గుచ్చుకున్నట్లు అనిపించినా దాన్ని పట్టించుకోకుండా ఆడుకున్నాడు. కొంత సమయానికి నోటి నుంచి నురగలు రావడంతో స్నేహితులు ఆ బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బాలుడిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం తరలించారు. బాలుడిని 108లో తీసుకువెళ్తుండగా నరసన్నపేట సమీపంలో ఆ బాలుడు మృతి చెందినట్లు గుర్తించి నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. బాలుడి తండ్రి తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అయితే టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు పూర్తి స్థాయిలో పట్టించుకోకపోవడం వల్లనే తన కుమారుడు మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆరోపించారు.



సాయివినీత్ మృతదేహం

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

బూర్జ: మండలంలో గల కొరగాం గ్రామం ఆమదాలవలస–పాలకొండ ప్రధాన రహదారిపై మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పినివలస పంచాయతీ జంగాలపేట గ్రామానికి చెందిన కరణం మధుసూదనరావు కొరగాం పంచాయతీ బోరగ వలస గ్రామం నుంచి స్వగ్రామం జంగాల పేట వస్తుండగా.. కొల్లివలస వైపు నుంచి ఆమదాలవలస వైపు వస్తున్న రణస్థలం గ్రామానికి చెందిన లంక నారాయణరావు బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో వీరిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 సాయంతో వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్ పోస్టు సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యే చంపేసింది

- వీడిన గూనపాలెం మర్డర్ మిస్టరీ
- ప్రియునితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని దుశ్చర్య

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని గూనపాలెంలో ఈ నెల 17 అర్ధరాత్రి జరిగిన యువకుని హత్య కేసు మిస్టరీ వీడింది. కట్టుకున్న భార్యే ప్రియుడి సాయంతో భర్త సురేష్‌ను హత్య చేసినట్లు తేలింది. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉండటం, తనను ప్రశ్నిస్తున్నాడనే అక్కసుతో ప్రియుడు, మరో వ్యక్తి సాయం తీసుకుని ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. సీరా సురేష్ నగర పురపాలికలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తుండేవాడు. 14 ఏళ్ల కిందట ఇతనికి తిరుమలతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత మూడేళ్లుగా ఇరువురూ తరచూ గొడవలు పడుతుండేవారు. ఈ ఏడాది జనవరిలో గొడవల దృష్ట్యా తిరుమల ఇల్లు వదిలి బయటకు వెళ్లి చాలా రోజులు ఉండిపోయింది. మళ్లీ వచ్చి కాపురం చేసినా అప్పుడప్పుడూ గొడవలు జరిగేవి.

ఒడిశా యువకునితో సంబంధం..

తిరుమల నగరంలోని ఓ హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తుండేది. ఈ క్రమంలో అక్కడే పనిచేస్తున్న ఒడిశా యువకునితో పరిచయం ఏర్పడి.. అది కాస్తా ప్రేమగా మారి అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న సురేష్ భార్యతో మరింత గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 20న పెళ్లి రోజు ఉండటంతో 16వ తేదీ రాత్రి షాపింగ్ చేసి వచ్చాక సురేష్‌కు వండి పెట్టిన భోజనంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిద్ర మాత్రలు కలిపింది. తిన్నాక సురేష్ గాఢ నిద్రలోకి జారుకున్నాడు. ప్రణాళిక ప్రకారం ప్రియునికి ఫోన్ చేసి రమ్మనడంతో ప్రియుడు, ఆమదాలవలసకు సమీపంలో దాబాలో పనిచేస్తున్న మరో ఒడిశా యువకుడు కలిసి సురేష్ ఇంటికి చేరుకున్నారు. నిద్రలో ఉన్న సురేష్‌ను కత్తితో దారుణంగా పీక కోయడమే కాక, కడుపులో పొడిచి మృతి చెందాడని నిర్ధారించుకున్నాక అక్కడ నుంచి పరారయ్యారు. తర్వాత భార్య ఏమీ తెలియనట్లు సురేష్ తండ్రికి, ఇతర కుటుంబీకులు, స్థానికులకు సమాచారమిచ్చింది.

ఊహించినట్టే విచారణ చేసి..

హత్యోదంతం జరిగిన రోజే సురేష్ భార్య తిరుమలను ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్‌లు అనుమానించారు. మేడపైన తన పక్కనే ఉన్న భర్తను చంపుతుంటే తెలియకుండా ఉంటుందా అనే కోణంలోనే తమ విచారణ సాగినట్లు వారు చెప్పారు. ఆమెకుండే కాంటాక్ట్స్, ఎవరెవరితో మాట్లాడుతుంది, గతంలో తిరుమల అదృశ్యమై చాలా రోజులు బయట ఉండిపోవడం, ఒకటో పట్టణ పీఎస్‌లో సురేష్ ఫిర్యాదు చేయడం, ఆ సమయంలో ఆమె ఎక్కడున్నది.. అన్న వివరాలు సేకరించారు. అంతేకాక ఆమె వద్ద ఉన్న సీక్రెట్ మొబైల్‌ను కూడా సేకరించారు. చివరకు తాను పనిచేసిన హోటల్‌లో ఉన్న వ్యక్తితోనే తన భర్తను హత్య చేయించిందని నిర్ధారణకు వచ్చారు. బుధవారం దీనిపై మరిన్ని వివరాలు వెల్లడించనున్నట్లు, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాలల జిల్లా ఇన్‌చార్జి ఎన్.బాలాజీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరి ట్ ఆధారంగా ప్రవేశాలు కల్పించామని, మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష రాసి సీటు పొందని విద్యార్థులకు, ప్రవేశ పరీక్ష రాయకుండా 10వ తరగతిలో పొందిన వారికి మార్కుల మెరిట్ ప్రాతిపదికన స్పా ట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దపాడులో 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశం కోరే విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

బాలురు ఖాళీల వివరాలు

దుప్పలవలసలోని బైపీసీ గ్రూప్‌లో ఎస్సీ–04, బీసీ–01, కొల్లివలస బైపీసీ గ్రూప్‌లో బీసీ–01, కంచిలి బైపీసీ గ్రూప్‌లో బీసీ–01, ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ–01,ఎస్టీ - 01, బీసీ - 01, పాలకొండ ఎంఈసీ గ్రూప్‌లో ఎస్సీ - 31, ఎస్టీ- 02, బీసీ - 02, ఓసీ- 01, సి.ఇ.సి గ్రూప్ నందు ఎస్సీ - 16, ఎస్టీ-02, బీసీ - 02 ఖాళీలు కలవని తెలిపారు.

బాలికల ఖాళీల వివరాలు

తామరపల్లిలోని ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ - 11, ఓసీ- 01, బైపీసీ గ్రూప్‌లో ఓసీ - 01, పాతపట్నం ఎంపీసీలో ఎస్టీ - 01,ఓసీ- 01, వంగర బైపీసీ గ్రూప్‌లో బీసీ - 02, ఎంపీసీ గ్రూప్‌లో ఎస్టీ - 01, ఓసీ - 01, మందస ఎంపీసీ గ్రూప్‌లో ఎస్సీ- 29, బైపీసీలో ఎస్సీ -12, నందిగాం సి.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 31, ఎస్టీ - 01, బీసీ - 02, ఓసీ - 01 మరియు ఎంఈసీ గ్రూప్ నందు ఎస్సీ- 34, ఎస్టీ - 03, బీసీ - 02, భామిని నందు సి.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 31, ఎస్టీ -01, బీసీ -02 ఓసీ -01, హెచ్.ఇ.సి గ్రూప్‌లో ఎస్సీ- 29, ఎస్టీ- 02,బీసీ- 02 ఖాళీలు కలవు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9701736862, 7569788629 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నీలమణి దుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం భక్తులతో మంగళవారం కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి మంగళవారం తెల్లవారుజామునుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 23,668 మంది విద్యార్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు తెలిపారు. ఆయన మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు మాట్లాడుతూ జిల్లాలో మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగడం ముదావహమని, ఇందుకు సహకరించిన అధికారులు, సిబ్బందిని రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు అభినందించారు. అదే స్ఫూర్తితో సప్లిమెంటరీ పరీక్షలు కూడా సజావుగా జరిగేలా సహకరించాలని అధికారులను కోరారు. మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల నిర్వహణ కోసం 51 కేంద్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి 23,668 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30ల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలు ఉదయం వేళ మాత్రమే జరిగాయని, అయితే ఇపుడు రెండు షిఫ్టులలో పరీక్షలు జరుగుతున్నందుని, వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు సూచించారు. పోలీసు బందోబస్తుతో పాటు ప్రతి పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ పారా మెడికల్ సిబ్బందితో పాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో విద్యార్థులు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేయాలని, పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ కొనసాగేలా ఏ.పి.ఇ.పి.డి.సి.ఎల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు ఆదేశించారు. జవాబు పత్రాలు సకాలంలో స్వీకరించేలా తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ తనిఖీ అధికారి దుర్గారావు, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి, పరీక్షల ప్రత్యేక అధికారి కె.ప్రకాష్ రావు, డీఈసీ బి.శ్యాం సుందర్, కె.తవిటి నాయుడు, జి.సింహాచలం, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావు, అలీఖాన్ పోలీస్ తదితరులు పాల్గొన్నారు.